సాక్షి
జనగామ

మంగళవారం । 7 । మార్చి । 2023



ముందస్తు వేడుకలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని వర్గాల ప్రజలు ముందస్తు వేడుకలు జరుపుకున్నారు.

- 9లో▸



280 మద్యం బాటిళ్ల పట్టివేత

రైలు మార్గాన వరంగల్‌కు తరలించిన 280 మద్యం బాటిళ్లతోపాటు ఒకరిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$35^0/18^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత తగ్గుతుంది.

సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు ప్రజల విన్నపం
- గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ
- వివిధ సమస్యలపై 66 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- సత్వర పరిష్కారానికి ఆదేశాలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

జనగామ రూరల్: 'దివ్యాంగుడిని.. ఏపనీ చేయలేను.. పీజీ వరకు చదువుకున్నాను. జీవనోపాధికి రేషన్‌షాపు మంజూరు చేయాలి. వితంతు పింఛన్ కార్డు ఇచ్చి ఇప్పుడు పేరు తొలగించారు. వార్డులో మురుగు నీరుతో ఇబ్బందులు పడుతున్నాం'.. అంటూ సమస్యలు ఏకరువు పెట్టిన ప్రజలు పరిష్కరించాలంటూ వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 66 అర్జీలు వచ్చాయి. ఇందులో తహసీల్దార్ పరిధిలో 32, ఆర్డీఓ 8, డీఆర్డీఓ 6, పోలీస్ శాఖ 5, మున్సిపాలిటీ 2, ఇంజనీరింగ్ 3, విద్యాశాఖ, సివిల్ సప్లయ్, రోడ్లు భవనాలు, ఎస్సీ కార్పొరేషన్, పీఆర్, వ్యవసాయ శాఖ, ఎంపీడీఓ, హైడ్లామ్స్, హెల్త్, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. పరిశీలించి సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు సాగు నీరందించడానికి బొమ్మకూర్ నుంచి తీసిన కాల్వ పనులు గ్రామంలో రెండేళ్ల క్రితం నిలిచిపోయాయి. వెంటనే పూర్తి చేయించాలని రైతులు వినతి పత్రం అందజేశారు.
- లింగాలఘణపురం మండలం వడిచర్లకు చెందిన నిరుపేద మహిళ గండి స్వరూప దళిత బంధు కింద పాడి గేదలకు రుణం అందించాలని వేడుకుంది.
- తన ప్రమేయం లేకుండా భూమి అక్రమంగా పట్టా మారిపడి అయిందని, న్యాయం చేయాలని పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన దేశగాని సోమయ్య విజ్ఞప్తి చేశాడు.
- వ్యవసాయ భూమి పొరపాటున మరొకరి పేర పట్టా అయిందని.. దానిని తన పేర మార్చాలని పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామానికి చెందిన రొడ్డ వెంకటస్వామి అర్జీ పెట్టుకున్నాడు.

'డబుల్ బెడ్రూం' ఇవ్వాలి



రఘునాథపల్లి మండలం కంచనపల్లి ఎస్సీకాలనీ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు 21 మంది అనర్హులకు ఇచ్చారు. మాకు ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు. సర్వే చేయించి డబుల్ బెడ్రూం ఇప్పించాలని గ్రామస్తులు చంద్రయ్య, అశోక్, పద్మారావు, యాదగిరి, లక్ష్మి, యాదలక్ష్మి, జయ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

వక్ఫ్‌బోర్డు భూమిని కాపాడాలి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో 674 సర్వే నంబర్‌లో ఉన్న 5.4 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని ఇటీవల కొందరు ఆక్రమించడానికి అందులో ఖనీలు పాతారు. స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి భూమిని కాపాడాలని ముస్లింలు సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు.

అన్యాయంగా పింఛన్ తొలగించారు



బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన తీగల ప్రమీల భర్త వెంకటనారాయణ 2019లో మృతి చెందాడు. వితంతు పింఛన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా కార్డు మంజూరైంది. గ్రామంలో వచ్చిన లిస్టు నుంచి తన పేరు అన్యాయంగా తొలగించారని, బతకడానికి ఏ ఆధారం లేదని.. పింఛన్ మంజూరు చేయాలని ప్రమీల వేడుకుంది.

వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలి



జనగామలోని కురుమవాడకు చెందిన మైల బాలరాజు వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేయగా ఓటర్ కార్డులో 48 సంవత్సరాలు ఉందని నమోదు చేయడం లేదు. స్టడీ సర్టిఫికెట్‌లో మాత్రం 62 ఏళ్లు ఉంది. ధ్రువీకరణ పత్రం చూపించినా ఒప్పుకోవడం లేదు. సమస్య పరిష్కరించి పింఛన్ ఇప్పించాలని బాలరాజు అర్జీ పెట్టుకున్నాడు.

రేషన్ షాపు మంజూరు చేయాలి



జనగామ మండలం ఎల్లంల గ్రామానికి చెందిన నిడిగొండ నరేష్ పుట్టుకతోనే మరుగుజ్జు. పీజీ వరకు చదువుకున్నాడు. బతకడానికి ఏ ఆధారం లేదు. తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామంలో ఇన్‌చార్జ్ కింద నడుస్తున్న రేషన్ షాపు ఉంది. దివ్యాంగుల కోట కింద మంజూరు చేసి ఆదుకోవాలని దరఖాస్తు పెట్టుకున్నాడు.

సీసీరోడ్డు వేయాలి



కలెక్టరేట్ ఎదురుగా 2వ వార్డులో రోడ్డు గుంతలమయంగా మారింది. అందులో మురుగు నీరు నిలిచి దోమలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇళ్లలోకి వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు విన్నవించారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

జనగామ రూరల్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సంబంధిత అధికారుల హైపర్ కమిటీతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న ఇంటర్ ప్రథమ, 16న ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని, 9,363 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా.. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఏప్రిల్ 13న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను 6,759 మంది విద్యార్థులు రాయనుండగా.. 42 సెంటర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రాము, డీఐఈఓ శ్రీనివాస్, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకొని ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్, ఇప్పగూడెం పీహెచ్‌సీ, జిల్లా ప్రధాన ఆస్పత్రిలో శిబిరాలు ఉంటాయని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్లు సుధీర్‌కుమార్, సుగుణాకర్‌రాజు, జయంతి, వసంత, రాము తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం



రఘునాథపల్లి: తెలంగాణలో దుర్మార్గపు పాలకులను గద్దె దింపి బహుజనుల రాజ్యాధికారం స్థాపించడమే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఖిలాషాపూర్ సర్వాయి పాపన్న కోట వద్ద చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఆయన నాయకులతో కలిసి ఖిలాషాపూర్‌లో సంబరాలు చేసుకున్నారు. అనంతరం సమావేశంలో వెంకటస్వామి మాట్లాడుతూ ఎనిమిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా మోసపోయారని, రాబోయే రోజుల్లో బహుజనులు అగ్రవర్ణ పార్టీలను తరిమికొట్టి రాజ్యాన్ని పాలించబోతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం సమ్మక్క, ఉపాధ్యక్షుడు మోకినపల్లి చక్రపాణి, నాయకులు జీడి యాకుబ్, తాళ్లపల్లి చంద్రయ్య, శాగ అరుణ్, గందమల్ల క్రాంతికుమార్, తొందూరు భరత్, మాదారపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ మేళా



రఘునాథపల్లి: మండల పరిధి శ్రీమన్నారాయణపురంలో ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న ఆదేశాల మేరకు సోమవారం సంస్థ ఉద్యోగులు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. గ్రామ పంచాయతీ వద్ద అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్టీసీ ప్రతినిధి రాజు మాట్లాడుతూ దరఖాస్తులు అందజేసిన దివ్యాంగులకు మూడు రోజుల్లో బస్‌పాస్‌లు అందజేస్తామని చెప్పారు. మండల పరిధి అన్ని గ్రామాల్లో బస్‌పాస్ మేళాలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చింత సుశీల, ఎంపీటీసీ తూడి విజయ, అంగన్‌వాడి టీచర్లు రమాదేవి, శోభ, కారోబార్ సత్యనారాయణ, దివ్యాంగుల నాయకులు ఉడుత అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీ పాలకుర్తి కోఆర్డినేటర్‌గా విజయ్



పాలకుర్తి: వైఎస్సార్ టీపీ పాలకుర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా మండలంలోని మల్లంపల్లి శివారు తండాకు చెందిన లకావత్ విజయ్‌ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల సోమవారం ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిర్వర్తించి పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని విజయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కేంద్ర సర్కారు విధానాలను ప్రజలకు వివరించాలి



జనగామ రూరల్: కేంద్ర సర్కారు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ప్రభుత్వాన్ని గద్దె దింపేలా చైతన్యవంతులను చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా బీజేపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలపై కోత పెట్టి నిధులు భారీగా తగ్గించిందన్నారు. ఉపాధి పనికి, సాగు నీటి వనరులకు నిధులు ఇవ్వాలని కోరినా నిరాకరించిందని చెప్పారు. కేంద్ర సర్కారు తీరుపై 17, 23, 24 తేదీల్లో చేపట్టిన జనచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎదునూరి వెంకట్రాజం, ఇర్రి ఆహల్య, రాపర్తి రాజు, సోమయ్య, రమేష్, శేఖర్, గోపి, ప్రకాష్, విజేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో వేడుకలు

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

ఒత్తిడి లేని విద్య అందించాలి

వర్మి కంపోస్టు తయారీపై శ్రద్ధ చూపాలి

- వివరాలు 10లో▸





రంగు పడుద్ది

- నేడు హోలీ పండుగ

పట్టణంలో కామదహనం, (ఇన్‌సెట్‌లో) రంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం హోలీ పండుగ జరుపుకోనున్నారు. కాముని పున్నమి సందర్భంగా సోమవారం రాత్రి పట్టణంతోపాటు గ్రామకూడళ్లలో కామదహనం నిర్వహించారు. వారం రోజులుగా జాజిరి ఆడిన పిల్లలంతా కోలలను, మహిళలు ఇళ్లలోని పాత వస్తువులను మంటల్లో వేశారు. కాముడి చుట్టూ నీళ్లు పోసి.. గుడాలు చల్లుతూ ఆరగించారు. పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. – జనగామ

నేటి నుంచి వానకొండయ్య జాతర

- శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణానికి ఏర్పాట్లు
- తలంబ్రాలు తీసుకురానున్న మంత్రి



గుట్టపై మూలవిరాట్(ఫైల్)

దేవరుప్పుల: శ్రీ వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతర మంగళవారం నుంచి కడవెండిలో ప్రారంభం కానున్నది. స్వామివారి కల్యాణోత్సవానికి ఉదయం స్థానిక హనుమాన్ ఆలయం నుంచి పద్మశాలీలు నూతన వస్త్రాలు తయారు చేస్తుండగా.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తలంబ్రాలు తీసుకురానున్నారు. ఉగాది వరకు కొనసాగనున్న ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

ఇంతకు ముందు జాతరలో పాలకవర్గాలు కంటితుడుపుగానే మౌలిక వసతులు కల్పిస్తుండగా కడవెండి గ్రామస్తులు విరాళాలు సేకరించి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుట్టపైకి మెట్లు, స్వామివారు ఉండే సొరికె అభివృద్ధి పనులను దాత అనిల్‌కుమార్ జోషి సహకారంతో ఆలయ పూజారి సంపత్ కుమారచార్యులు చేపట్టారు. జాతర ఉత్సవ కమిటీలో కీలకంగా పనిచేసిన నల్ల మల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు గుట్టకు ముఖద్వారం ఏర్పాటు చేయించారు. ఇటీవల మంత్రి దయాకర్‌రావు మౌలిక వసతులు, గుట్టపైకి ఘాట్ రోడ్డు, కల్యాణ మండపం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు మంత్రి ఎర్రబెల్లి మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు.

కల్యాణోత్సవానికి ఆహ్వానం

వానకొండయ్య జాతరను పురస్కరించుకొని మంగళవారం జరిగే శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవానికి రావాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌లను జాతర ఉత్సవ కమిటీ కోరింది. ఈ మేరకు సర్పంచ్‌లు పోతిరెడ్డి బెల్లినా లీనారెడ్డి, శంకర్, ఎంపీటీసీ దుబ్బాక కవిత రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాషిపాక భిక్షపతి, పంతం సోమయ్య, వీరన్న, ఉడుత రాజ్‌కుమార్ తదితరులు సోమవారం వారిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



నర్మెటలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

నర్మెట: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి సీతారాంనాయక్ అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కేజీ టు పీజీ నాణ్యమైన ఉచిత విద్యతోపాటు, పదో తరగతి విద్యార్థినులకు కాస్మొటిక్స్, షూ, చేతి గడియారం, ప్యాడ్, కంపాస్, పౌష్టిక విలువలతో కూడిన భోజనం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, క్రమశిక్షణతో కూడిన బోధన అందిస్తున్నదని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇరుప సారయ్యదొర, ఉపాధ్యాయులు వాసు, శంకర్, కుమార్, కిష్ట, దశరథ్, హరిచంద్, సమ్మక్క, శ్రీమతి, గురు, రవిందర్, సజ్జన్‌లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సర్కారు కృషి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పులలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల/కొడకండ్ల: మహిళా సాధికారతకు తెలంగాణ సర్కారు ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకుర్తి మండలం తొర్రూరులో నిర్వహించే మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయడానికి సోమవారం దేవరుప్పుల, కొడకండ్ల మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీపీలు బస్వ సావిత్రి, జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.550కోట్ల వడ్డీ లేని రుణాల పథకాన్ని మంత్రి కేటీఆర్ తొర్రూరు వేదికగా ఆవిష్కరిస్తారని వెల్లడించారు. నియోజవర్గాన్ని ఆదర్శంగా తీసుకునేలా పదివేల మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తోడ్పాటు అందిస్తామని చెప్పారు. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాలకే అప్పగిస్తామని పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో డీఆర్‌డీఓ రామిరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ నాని, బీఆర్ఎస్ నాయకులు దయాకర్, పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, సిందె రామోజీ, వెంకటేశ్వర్‌రావు, అభిమన్‌గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం



మంత్రికి సమస్యలు వివరిస్తున్న దశమంతరెడ్డి

జనగామ: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక అభివృద్ధిశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి వెళ్తుండగా.. జిల్లా జాతీయ రహదారి నెల్లుట్ల వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. 163 హైవే నిర్మాణంలో జరిగిన లోపాన్ని సవరించాలని మంత్రికి విన్నవించారు. హైదరాబాద్ హైవేపై నిర్మాణం చేయాల్సిన ఫ్లెవోవర్‌ను.. సూర్యాపేట నుంచి సిద్దిపేట ఎన్‌హెచ్ 365–బి వెళ్లే రహదారిపై నిర్మించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే హైదరాబాద్–వరంగల్ హైవేపై ఎటువంటి సర్వీసు రోడ్డు లేదని, ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొంతం శ్రీనివాస్, బొట్ల శ్రీనివాస్, సంపత్, కాసుల శ్రీనివాస్, కోటి తదితరులు ఉన్నారు.

గోవుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్



జఫర్‌గఢ్‌లో గోవులను పంపిణీ చేస్తున్న అగర్వాల్

జఫర్‌గఢ్/దేవరుప్పుల: పంటల దిగుబడితో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు గోవుల పెంపకం ఎంతో దోహదపడుతుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. జఫర్‌గఢ్ మండలం తిమ్మాపూర్‌లో శ్రీ ఆంజనేయ గోశాల, దేవరుప్పుల మండలం ధర్మగడ్డతండాలో శ్రీభద్రకాళి గోశాల ఆధ్వర్యంలో సోమవారం రైతులకు లేగ దూడలను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. గోసంపద రోజురోజుకూ తగ్గిపోతోందని, అధిక రసాయన ఎరువుల వాడకంతో భూమిలో సారం, పంటల దిగుబడి తగ్గుతోందని అన్నారు. గోవు మూత్రం, పేడ ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి పంటలకు ఉపయోగిస్తే నాణ్యమైన దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ మేరకు గోశాల ద్వారా రైతులకు ఉచితంగా పశువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర గోశాల ఫ్రిపరేషన్ అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరవింద్, దుర్గం, రోజా, దేవా, గణేష్, సర్పంచ్‌లు జ్యోతినాగరాజు, సునిత ఆంజనేయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు



విరాళం అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

దేవరుప్పుల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందరివాడని సామాజిక కార్యకర్త బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. దేవరుప్పుల చౌరస్తాలో నిర్మించే అంబేడ్కర్ విగ్రహానికి రూ.1,11,000 విరాళాన్ని ఆయన సోమవారం పెద్ద మడూరులో నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కారుపోతుల శ్రీనివాస్, బబ్బూరి నాగరాజు, యాదగిరి, రవి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ జోగు సోమనర్సయ్య, భాషిపాక యాదగిరి, నల్ల ఉమేష్, బండారి రాములు, ఉపసర్పంచ్ మానుపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'లీగల్ సెల్' సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న లీగల్ రిసోర్స్ పర్సన్ స్వప్న

లింగాలఘణపురం: మహిళలు లీగల్ సెల్ అథారిటీ సేవలను వినియోగించుకోవాలని లీగల్ రిసోర్స్ పర్సన్ బిర్రు స్వప్న అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐకేపీ భవనంలో లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాగల్ల శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు లైంగిక వేధింపులకు.. ఇతర అవమానాలకు గురైనప్పుడు భయపడకుండా లీగల్ సెల్ అథారిటీని ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సహాయం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవీందర్, తహసీల్దార్ అంజయ్య, ఎస్సై ప్రవీణ్, డాక్టర్ కరుణాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల విద్యుత్ ఉచితం



రాజవరంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

చిల్పూరు: ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీలను వినియోగించుకోవాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం అశోక్‌కుమార్ అన్నారు. రాజవరంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ మీసేవ ద్వారా పొందిన కుల ధ్రువీకరణ పత్రాలను సంబంధిత ఏఈ కార్యాలయంలో అందించి ప్రభుత్వ పరంగా నెలకు వచ్చే 100 యూనిట్ల ఉచిత రాయితీని పొందవచ్చని చెప్పారు. నూతనంగా మీటర్లు తీసుకోవాలంటే రాయితీ ప్రకారం మీసేవా కేంద్రాల్లో రూ.1,050 మాత్రమే చెల్లించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ ఆపరేషన్ డీఈ హుస్సేన్‌నాయక్, ఏడీఈ సత్యనారయణ, రాజవరం, ఘన్‌పూర్, జఫర్‌గఢ్ ఏఈలు రమేష్, చంద్రమోహన్, విశ్వసాహితి, సబ్ ఇంజనీర్లు సాధనరెడ్డి, వినీత్‌రెడ్డి, వరుణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూలో మెస్ బంద్

కేయూ క్యాంపస్: కేయూలో అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో పీజీ కోర్సుల విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తున్న విషయం విదితమే. కామన్‌మెస్‌లో మరమ్మతులు పూర్తికాగా అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి ఫర్నీచర్‌ను కామన్ మెస్‌లోకి తీసుకొస్తున్నామని సోమవారం నుంచే మెస్ సదుపాయాన్ని యూనివర్సిటీ అధికారులు బంద్ చేశారు. అల్పాహారం కూడా పెట్టలేదు. రేపటి వరకు భోజనం కూడా బంద్ చేస్తారని, రాత్రి డిన్నర్ నుంచి రీఓపెన్ చేయనున్నట్లు సమాచారం.కామన్‌మెస్‌ను రీ ఓపెన్ చేయాలని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేసిన విషయం విదితమే. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు కూడా ఇటీవల సందర్శించి త్వరలోనే రీ ఓపెన్ చేస్తామని కూడా ప్రకటించారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

ఎంజీఎం: ఎంజీఎంలోని పిల్లల వార్డులో సోమవారం సెల్‌ఫోన్ దొంగలిస్తున్న వ్యక్తిని సెక్యూరిటీ గార్డులు పట్టకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. ఆస్పత్రిలోని పిల్లల వార్డులో సోమవారం తెల్లవారు జామున ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగలిస్తున్నాడు. గమనించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్రీనివాస, రమేశ్‌లు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

రంగుల పండుగ వచ్చేసింది..


మోదుగు పూల చెట్టు


రంగుల అమ్మకాలు

- సహజ సిద్ధమైన రంగులే మేలు
- స్నానానికి చెరువులు, వాగులు, కుంటలకు సరదాకు వెళ్లి.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

నేడు హోలీ

జనగామ: తెలుగు నెలల్లో చివరకి వచ్చే పాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చతుర్దశి నాడు కాముని దహనం నిర్వహించి మరుసటి రోజు రంగుల హోలీ జరుపుకుంటారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో హోలీ ఒక్కటి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. రంగులు చల్లుకోవడంతో పాటు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సహజరంగులే మేలు

హోలీ వేడుకల్లో ప్రాణాంతక రసాయనాలు వాడకూడదు. వీటితో చర్మ సంబంధ వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే సహజసిద్ధమైన గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుకు పూల పొడితో తయారు చేసిన రంగులతో వేడుకలు జరుపుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే..

హోలీ సంబురాలు కుటుంబాల్లో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా జిల్లాలో ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్దకు స్నానానికి వెళ్లి నీటిలో మునిగిపోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చెరువులు, జలాశయాల వద్ద సెల్ఫీలు దిగడం.. సరదాలకు పోయి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కాస్త జాగ్రత్తలు పాటిస్తే.. పండుగలను సంతోషంగా మార్చుకోవచ్చు. ఈతకు వెళ్లేవారు చెరువులోతు ఎంత ఉంది.. ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోవాలి. ఏమీ తెలియకుండా అందులో దూకితే బండలు, ముళ్ల కంపలతో ప్రాణాపాయం ఉంటుంది. మద్యం సేవించి నీటిలో ఎట్టి పరిస్థితుల్లో దిగకూడదు. ఈత రాకుంటే అటు వైపే వెళ్లొద్దు.

సూచనలు

హోలీ ఆడటానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం. దీని వల్ల రంగులు శరీరానికి సరిగా పట్టుకోవు ఇంకవు. దీంతో రంగులను శుభ్రం చేసుకోవడం చాలా సులభమవుతుంది. చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలిపి రాస్తుంటారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది.

కెమికల్స్ రంగులు వద్దు



రంగుల పండుగ మోజులో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. మనపై చల్లే రంగుల నుంచి వచ్చే పొగ కడుపులోకి పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడతారు. రంగులు ఎక్కువగా కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. అలాగే స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. ప్రకృతి సహజసిద్ధమైన రంగులతో పండగ జరుపుకుని, ఆరోగ్య వంతమైన జీవితం గడపాలి.

- వనం శ్రీనివాస్, ఎండీ సివిల్ సర్జన్

నీటితో ఆటలొద్దు



రంగుల పండుగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు, పెద్దలు స్నానం కోసం చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. స్నేహితులతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న తర్వాత, ఇంటి వద్దనే ఫ్రెష్ కావాలి. జలకాలాట కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. చెరువులు, కుంటల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఉండే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సాహసం చేయరాదు. పోలీసులు సైతం ప్రతీచోట నిఘా వేసి ఉంచారు.

- ఎలబోయిన శ్రీనివాస్, సీఐ,జనగామ

గంజాయి విక్రయదారుల అరెస్ట్

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


అరెస్టు చేసిన నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయ్ విక్రయాలపై అందించిన మేరకు ఇంతేజార్ గంజ్ పోలీసులతో సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో పావురాల రమేశ్, బండెల సాయికుమార్, మహ్మద్‌చాంద్ పాషా, మహ్మద్ సమీర్‌లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన క్రమంలో విక్రయదారుల నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం వారిని విచారించగా తాము కామన్ ఫ్రెండ్స్ అని రెండు సంవత్సరాల నుంచి గంజాయి తాగడం, అమ్మడం అలవాటుగా ఉందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయిని సుమంత్, సాయి, విక్కీల నుంచి పలుమార్లు కొనుగోలు చేసినట్లు తెలిపారని వివరించారు. ప్రస్తుతం ఆ ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలోని పావురాల రమేశ్‌పై వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబాబాద్‌లతో పాటు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లలో 23 కేసులు ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

హసన్‌పర్తి/గీసుకొండ: కడుపునొప్పి భరించలేక ఒకరు, తాగుడుకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది ఓ ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం రామరాజు(42) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా రామరాజు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పతి సిబ్బంది సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన ఆడెపు రాజు(32) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..


మృతిచెందిన సర్వర్

మహబూబాబాద్ రూరల్ :అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టౌన్ ఎస్సై రవి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డ్ ప్రాంతంలో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సర్వర్ (52) మూడు రోజులుగా ఇంట్లోనే ఉన్నాడు. ఈ నెల 4వ తేదీన పని మనిషి ఇంట్లో పనిచేసేందుకు వెళ్లగా సర్వర్ తనకు ఆరోగ్యం బాగోలేదని ఇంటి బయట వరకు ఊడ్చి వెళ్లిపొమ్మని పనిమనిషితో చెప్పాడు. మూడు రోజుల అనంతరం మళ్లీ సోమవారం ఉదయం పని మనిషి పనిచేసేందుకు వెళ్లగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండగా ఆమె స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు తెరిచి వెళ్లి చూసేసరికి సర్వర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు యాకుబ్ జాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సర్వర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు. సర్వర్ శనిగపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ కలహాలతో మృతుడి భార్య, కుమారుడు, కుమార్తె కొంత కాలంగా ఆయనకు దూరంగా ఉంటున్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి..


సిద్దిరాములు(ఫైల్)

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్ద శిథిలావస్థలో ఉన్న దేవతల గుడిని మరమ్మతులు చేయించేందుకు ఇటుక తీసుకురావడాని వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి గొడుగు సిద్దిరాములు(48) మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడవటూర్ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం...సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు గ్రామమైన బంజేరుకు చెందిన సిద్దిరాములు వ్యవసాయ బావి వద్ద అమ్మవారి దేవాలయం ఉంది. మరమ్మతులు చేపించేందుకు ఇటుకను తీసుకురావడానికి సొంత ట్రాక్టర్‌లో పెద్దనాన్న కుమారుడు గొడుగు అయిలయ్యతో మండల పరిధిలోని కొడవటూర్‌కు సిద్దిరాములు బయలుదేరాడు. గ్రామ సమీపానికి ట్రాక్టర్ చేరుకోగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో రాములు పడగా అతడిపై ట్రాక్టర్ పడిపోయింది. అయిలయ్య పక్కకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి అతన్ని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. మృతునికి భార్య రేణుక, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం


శరత్(ఫైల్)

వాజేడు: మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడి మృతదేహం గోదావరిలో కనిపించింది. ఈ ఘటన ములుగు జిల్లాలోని వాజేడు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రేఖ అశోక్, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పూనెం శరత్(26) 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో మద్యానికి బానిస కావడం, మతి స్థిమితం సరిగా లేక పోవడంతో బంధువుల ఇళ్లలో ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. తెల్లారినా ఇంటికి రాకపోవడంతో కుంటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకడంతో పాటు బంధువులను అడిగి తెలుసుకున్నారు. అయినా అతని ఆచూకీ లభించలేదు. గోదావారి ఒడ్డున అతని చెప్పులు కనిపించడంతో గోదావరిలో సైతం గాలించగా ఆచూకీ లభించలేదు. కానీ సోమవారం ఉదయం గోదావరిలో శరత్ మృతదేహం కనిపించింది. మృతుడి తల్లిదండ్రులు పూనెం రమణ, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడికి భార్య ఉంది.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కేటీఆర్ సభకు భారీసంఖ్యలో తరలించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఈ నెల 8న మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభకు పాలకుర్తినుంచి భారీ సంఖ్యలో మహిళలను తరలించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తినుంచి 4వేల మంది మహిళలను తరలించాలని సూచించారు. తొర్రూరు సభలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఆదనపు పీడీ నూరోద్దిన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ వీరమానేని యాకాంతరావు, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెలీపాడ్, సభాస్థలి పరిశీలన

వరంగల్(పర్వతగిరి): నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏనుగల్‌లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానుండగా సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ గోపి హెలిపాడ్ సభా స్థలం, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

దేశాయిపల్లివాసికి తమిళనాడులో ప్రమాదం..

- ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి తీవ్రగాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స


తమిళనాడులో చికిత్స పొందుతున్న రజినీకుమార్

దుగ్గొండి: తమిళనాడు రాష్ట్రంలో ప్రమాదవశాత్తు ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన కందికొండ రజినీకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ప్రభుత్వ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే..రజినీకుమార్ గత కొన్ని సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రంలోని ట్యుటికోరిన్ జిల్లా కేంద్రంలో ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం విధులు నిర్వర్తిస్తుండగా యాసిడ్‌తో నిండి ఉన్న గాజు బాటిల్ పేలిపోయింది. దీంతో గాజు ముక్కలు రజినీకుమార్ పొట్టకు గుచ్చుకున్నాయి. యాసిడ్ పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే అతన్ని సిబ్బంది ట్యుటికోరన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు..

అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్ది హామీ

రజినీకుమార్ ఆరోగ్య పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెంటనే రజినీకుమార్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ట్యుటికోరన్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తమిళనాడు వైద్యుల అనుమతితో రోగిని తన సొంత ఖర్చులతో విమానంలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ నుంచి ఎల్‌ఓసీ ద్వారా యశోద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు రజినీకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హోలీ ఆడుకునేందుకు వెళ్లి వచ్చి..

- నీటి సంపులో పడి బాలుడు మృతి


కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి


కుశాంత్‌కుమార్ (ఫైల్)

గార్ల: హోలీ ఆడుకునేందుకు వెళ్లివచ్చి ఇంటి ఆవరణలోని నీటి సంపు వద్దకు కాళ్లుచేతులు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గార్ల మండల పరిధిలోని చవిటి తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చవిటితండాకు చెందిన గుగులోత్ కుశాంత్‌కుమార్(4) తోటి స్నేహితులతో కలిసి హోలీ ఆడుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి ఆవరణలోని నీటి సంపువద్దకు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయాడు. బాలుడి తండ్రి వీరన్నకు కిరాణం షాపు ఉండడంతో బిజీగా ఉన్నాడు. రాత్రి పడుకునేముందు కుమారుడు ఇంకా రాలేదని స్నేహితుల వద్దకు వెళ్లి ఆరా తీయగా రాత్రి 8గంటలకే ఇంటికి వచ్చాడని తెలిపారు. అనంతరం తండా అంతా తిరిగి ఇంటికి వచ్చిన తండ్రి నీటి సంపులో చూడగా మునిగిపోయి ఉన్నాడు. కొన ఊపిరితో ఉన్న కుమారుడిని వెంటనే చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృత్యువాత పడ్డాడు. సోమవారం ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. బాలుడిపై పడి తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. బాలుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

కొండచిలువల కలకలం

- నాలుగింటిని స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు



భారీ కొండచిలువను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు (ఇన్‌సెట్‌లో) మిగితా మూడింటిని సంచుల్లో తీసుకెళ్తున్న అధికారులు

రాయపర్తి: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వెనుకాల ఉన్న గొల్లకంచ ఎస్సారెస్పీ కాల్వలో నాలుగు కొండ చిలువలు సోమవారం కలకలం రేపాయి. వీటిని గమనించిన రైతులు సర్పంచ్ గారె నర్సయ్యకు సమాచారం అందజేశారు. వెంటనే సర్పంచ్ ఫారెస్ట్ అధికారులకు చేరవేయడంతో ఫారెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్ రాజు పాములు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ కాల్వలో స్థావరం ఏర్పాటు చేసుకుని ఉన్నట్లు గమనించిన వారు జేసీబీ సాయంతో వాటిని బయటికి తీసి గోనె సంచుల్లో భద్రపరిచారు. వాటిని రిజర్వు ఫారెస్ట్‌లో వదులుతామని ఫారెస్ట్ అధికారి తెలిపారు. ఇందులో రెండు కొండ చిలువలు ఆరు నుంచి ఎనిమిది అడుగులు ఉండగా మరో రెండు పాములు మూడు నుంచి నాలుగు అడుగులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, పంచాయతీ కార్యదర్శి అశోక్ నాయక్, వార్డు సభ్యుడు పోగులకొండ వేణు, రైతులు నల్లబింగి సాయిలు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

280 మద్యం బాటిళ్లు పట్టివేత

- నిందితుడి అరెస్ట్


బాటిళ్లను స్వాధీనం చేసుకుని శ్రీకాంత్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఖిలా వరంగల్: రైలు మార్గం ద్వారా వరంగల్ మహానగరానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 90ఎంఎల్ సైజ్ గల 280 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి ఖిలా వరంగల్ మండలం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు రైల్వే మార్గం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ నగరానికి పెద్ద ఎత్తున మద్యం, ఎండు గంజాయి దిగిమతి అవుతుందని పక్కా సమాచారం అందిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా వేసి ఉంచారు. ఓ వ్యక్తి రైలు దిగి శివనగర్ వైపు వెళ్లే ప్రాంగణానికి చేరుకున్నాడు. ప్రయాణికుల బ్యాగులు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. అందులో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నక్కలగుట్ట తండాకు చెందిన ధారవత్ శ్రీకాంత్ బ్యాగును పరిశీలించగా బ్యాంగులో సుంకం చెల్లించని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 280 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రూ. 23వేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బి.సరతి, హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు ఎ.చిరంజీవి, బి.కరుణాకర్, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.